# బాలగోపాల్‌ను స్మరించుకుందాం రండి




ప్రతి ప్రజాసమస్యనూ చారిత్రక స్పృహతో, సామాజిక ఎరుకతో, మానవహక్కుల గీటురాయితో వ్యాఖ్యానించగల ఒక గొప్ప ఆలోచనాపరుడ్ని కోల్పోయి ఐదేళ్లయింది. ఈ అక్టోబర్ 5న మనం హైదరాబాద్‌లో జరుపుకోబోతున్నది బాలగోపాల్ ఐదవ వర్ధంతి సభ.

కాలాన్ని సంవత్సరాలలో కాకుండా సమస్యల్లో లెక్కించుకుంటే 500 ఏళ్లయినట్టుగా అనిపించిన కాలం ఇది. భారతదేశంలో, మరీ ముఖ్యంగా మన రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక మార్పులు సంభవించిన కాలం ఇది. వాటి వెంట వచ్చిన సమస్యలూ తక్కువేం కాదు. కొన్ని కొత్తవి. కొన్ని మరీ పాతవి. కొన్ని పాతవాటికి కొనసాగింపుగా వచ్చినవి. దేన్నీ, ఎవర్నీ పూర్తిగా నమ్మడానికి వీల్లేని పరిస్థితులు. ఈ ఐదేళ్లలో బాలగోపాల్ గైడెన్స్ కోసం ఎదురుచూసిన సందర్భాలెన్నో! దాన్ని శాశ్వతంగా కోల్పోయినందుకు బాధపడిన వారెందరో!

ప్రజలే చరిత్ర నిర్మాతలు అని సామాజిక ఆలోచనాపరులు పదేపదే చెపుతుంటారు. కాని ప్రజల ఆకాంక్షల మెట్లెక్కి అధికారంలోకి వచ్చినవాళ్లందరూ తామే

| సదస్సు | | అంశాలు | | |
|---|---|---|---|---|
| | **5 అక్టోబర్, ఆదివారం**<br>**ఉ. 9.30 - 1.30 గంటల వరకు.**<br>**సుందరయ్య విజ్ఞాన కేంద్రం,**<br>**హైదరాబాద్** | | **చుండూరు మారణకాండ -**<br>**అన్యాయమైన హైకోర్టు తీర్పు** | **- జి. శివనాగేశ్వరరావు** |
| | | | **రాజ్యం-నేరసంస్కృతి-న్యాయం** | **- వృందా గ్రోవర్** |
| | | | **పాలస్తీనా విషాదం** | **- ప్రొ. అచిన్ వనాయక్** |

చరిత్ర నిర్మాతలమన్నట్టు ప్రవర్తించడం చూస్తున్నాం. ప్రజల కోరిక మేరకు ఏర్పాటైన ఒక రాష్ట్రం తన బిడ్డలైన లక్షలమంది ఆదివాసులను నట్టేట ముంచడానికి సిద్ధ పడింది! అవినీతి, అసమర్ధతలను సహించబోనని ప్రకటిస్తూ, అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూ గద్దెనెక్కిన హిందుత్వవాది ఈరోజు ఏ ఆధిపత్యం కోసం వెంపర్లాడుతున్నాడో వీక్షిస్తున్నాం. వాస్కోడిగామాలు వెతుక్కుంటూ మళ్లీ భారతదేశానికి వచ్చే పరిస్థితులు కల్పిస్తానంటున్నాడు! నేను మాత్రమే అభివృద్ధి చేయగలను, నా మీద భరోసా పెట్టుకోండి అని 20 ఏళ్ల నుంచి ప్రతిదినం అభివృద్ధి మంత్రం జపిస్తున్న ప్రపంచబ్యాంకు మరో ముద్దుబిడ్డను కూడా గమనిస్తున్నాం.

ప్రపంచం వైపు చూస్తే అమెరికా కపటనీతి, ఇజ్రాయిల్ దమననీతి, వాటికి వ్యతిరేకంగా ఆఫ్ఘనిస్తాన్, పాలస్తీనాలలో పెల్లుబుకుతున్న ప్రజా ఉద్యమాలు కనబడతాయి.

ఇలాంటి ఎన్నో అంశాలపై అనునిత్యం స్పందించే బాలగోపాల్‌కు నివాళిగా నడుస్తున్న చరిత్రలోంచి మూడు అంశాలను ఎంపిక చేసుకుని ఒక సదస్సును ఏర్పాటు చేశాం. ఒకటి, చుండూరుపై హైకోర్టు తీర్పు, రెండు, శిక్షా భయం లేకుండా ప్రభుత్వం చేస్తున్న నేరాలు (State Impunity), మూడు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఘోరకలి.

చుండూరులో 8 మంది దళితుల్ని చంపి 23 ఏళ్లు అయింది. ప్రత్యేక న్యాయస్థానంలో ఎంతో కొంత న్యాయం పొందామన్న సంతోషం కూడా వారికి మిగల్చకుండా హైకోర్టు గత ఏప్రిల్‌లో దోషులందర్నీ నిర్దోషులుగా ప్రకటించి విడుదల చేసింది. ఈ తీర్పులోని లోపాలేమిటో, అసత్యాలేమిటో, మూకుమ్మడిగా దళితులు హత్య చేయబడ్డ ఘటనలలో నేరం ఎందుకు రుజువు కావడం లేదో చుండూరు ప్రత్యేకకోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాదించిన జి. శివనాగేశ్వరరావు వివరిస్తారు.

పేరుకు ప్రజాస్వామిక భారతదేశమైనా పోలీసు హింస దినదినం పెరిగిపోతున్నది. శిక్షాభయం లేకుండా వారిలో కొనసాగుతున్న ఈ నేరసంస్కృతి గురించి, దాన్ని పెంపొందిస్తున్న ప్రభుత్వాల పాత్ర గురించి అత్యున్నత న్యాయస్థానం చాలాసార్లు కలవరపడ్తూ వ్యాఖ్యానాలు చేసింది. ఈ నేరాలకు వ్యతిరేకంగా అక్కడక్కడా అయినా కొన్ని పోరాటాలు జరుగుతున్నాయి. వాటికి అండగా నిలబడుతున్న ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది వృందా గ్రోవర్ ఈ అంశంపై ప్రసంగిస్తారు.

గత మూడు నెలలుగా పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు చేసి విధ్వంసం సృష్టిస్తోంది. 2000 మందికి పైగా పౌరులు మరణించారు. వీరిలో పిల్లలు, మహిళలు, వృద్ధులే ఎక్కువ. గాజాలో నాలుగవ వంతు పూర్తిగా ధ్వంసం అయింది, ఆ విధ్వంసం ఇంకా కొనసాగుతోంది. ఈ అంశంపై ప్రఖ్యాత విశ్లేషకుడు, Indian campaign for the Academic & Cultural Boycott of Israel సంఘంలో సభ్యులూ అయిన ప్రొ. అచిన్ వనాయక్ ఉపన్యసిస్తారు.

**బాలగోపాల్ బాటలో మన ఆలోచనలను పదును పెట్టుకోవడానికి, ముందుకు సాగడానికి ఈ సెమినార్ దోహదపడుతుందని ఆశిస్తున్నాం. అందరూ ఆహ్వానితులే.**

1-10-2014

**మానవహక్కుల వేదిక**

**Human Rights Forum (HRF)**

ప్రచురణకర్తలు : ఎస్. జీవన్ కుమార్ - 9849896286. వి.ఎస్.కృష్ణ - 9440411899